క్లుప్తంగా

22న సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: సంచార జాతుల కార్పొరేషన్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఆదేశాల మేరకు ఈనెల 22న ఉదయం 10.30 గంటలకు జిల్లాలోని సంచార జాతుల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా బీసీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి సంచార జాతుల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరై వారి సమస్యలను, సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

బహిరంగ సభ విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 24న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించే బీఆర్‌ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులు యూనీస్ అక్బానీ, సాజిదోద్దీన్ కోరారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం వారు పరిశీలించారు. పార్టీ శ్రేణులు, రైతులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ ఉట్నూర్ పరిధిలోని యువకులకు ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కిర్బీ షిట్స్ హైదరాబాద్ కంపెనీలో ఒక సంవత్సరం పాటు ఉచిత శిక్షణ కల్పిస్తూ నెలకు రూ. 14వేల వేతనం, శిక్షణ పూర్తి అనంతరం ప్రముఖ ప్రైవేటు సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల యువకులు కేబీ ప్రాంగణంలోని గిరిజన శిక్షణ ఉపాధి కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న జర్నలిస్టులు

బోథ్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో జర్నలిస్ట్ సుదర్శన్‌పై దుండగులు దాడి చేయడాన్ని బోథ్ మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విలేకరులపై దాడులు జరగకుండా వారి రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు రూపొందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సీనియర్ అసిస్టెంట్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మల్లెపూల గంగయ్య, ఇర్ల గంగాధర్ (ఎర్రన్న), నవీన్ కుమార్, గొడిసెల రమణ గౌడ్, సంతోష్, షేక్ అలీ పాల్గొన్నారు.


మంచినీటి సహాయకులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లతో మంచినీటి సహాయకులు

తాంసి: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీటి సరఫరాలో భాగంగా గ్రామాల్లో మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. నీటి పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వివిధ అంశాలపై ఆయా గ్రామాలకు చెందిన మంచినీటి గ్రామ సహాయకులకు ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షకుడు తిరుపతి నీటి సరఫరాలో తీసుకోవాల్సిన అంశాల గురించి వివరించారు. ఎంపీడీవో మోహన్ రెడ్డి మంచినీటి సహాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్, ఎంపీవో లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకా వేస్తున్న పశువైద్యాధికారి గోవింద్‌నాయక్

ఇచ్చోడ: మండలంలోని సాథ్‌నంబర్, ఇస్లాంనగర్ గ్రామాల్లో శనివారం పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రైతు వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శేఖర్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురం

తాంసి మండలంలోని తాంసి, హస్నాపూర్, పాలోడి, గిరిగాం, తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామాల్లో శనివారం సద్దుల బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ.. సందడి చేశారు. యువతుల సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. అనంతరం సమీపంలోని వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– తాంసి, తలమడుగు



తలమడుగు: కజ్జర్ల గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తాంసిలో..



తలమడుగు: నిమజ్జనానికి వెళ్తున్న మహిళలు



తలమడుగు: నిమజ్జనం చేస్తున్న మహిళలు



తాంసి: బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు



తాంసి: బతుకమ్మలతో మహిళలు

పనులు పూర్తి చేసేలా చూస్తాం

సాక్షి ఎఫెక్ట్..

నార్నూర్: గాదిగూడ మండలంలోని మేడిగూడ ప్రభుత్వ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తయ్యేలా చూస్తామని ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావు అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సాక్షి దినపత్రికలో ×పాఠశాలలో వసతులు కరువు కథనాన్ని శనివారం ప్రచురించింది. దీంతో ఐటీడీఏ ఏఈ సునీల్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న వంటగదిని పరిశీలించారు. అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. గతంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పనులు చేయడం జరిగిందన్నారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. త్వరలో కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఏఈ సునీల్‌కు ఆదేశించారు.



పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

అభివృద్ధి పనులకు భూమిపూజ

నేరడిగొండ: మండలంలోని రోల్‌మామడ గ్రామంలో శనివారం బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. గ్రామంలోని స్కూల్ ప్రహరీ నిర్మాణాన్ని భూమిపూజ చేసి ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 లక్షలతో ఈ అభివృద్ధి పనులు చేసినట్లు పేర్కొన్నారు. కనీసం కూర్చోడానికి (బెంచీలు) లేవని తెలపగా వెంటనే స్పందిస్తూ వారం రోజుల్లోగా తన సొంత డబ్బులతో 10 బెంచీలు పాఠశాలకు పంపిస్తా అని హామీ ఇచ్చారు. ఆయన వెంట బోథ్ వ్యవసాయ శాఖ అధ్యక్షుడు బొడ్డు గంగారెడ్డి, బోథ్ వ్యవసాయ శాఖ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు, ప్రఫుల్ చందర్ రెడ్డి, బద్దం పోతారెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, తోడసం శంకర్, యాదవరావు, కపిల్, షేక్, అబూద్, గాజుల పోతన్న పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఆడే గజేందర్

'బెల్టు షాపులను తొలగించాలి'

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని 49 వార్డులతో పాటు అన్ని గ్రామాల్లోని బెల్ట్‌షాప్‌లను తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎక్సైజ్ సీఐ విజయేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణంలోని అన్ని వార్డుల్లో బెల్టు షాపుల్లో కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్నారు. దేశీదారు, చీప్ లిక్కర్‌ను మిక్స్ చేసి కల్తీకి పాల్పడుతూ పలువురు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కుంటాల రాములు, ఎస్. అరుణ్‌కుమార్, జెజ్జంకి నర్సింగ్‌రావు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

జోనల్‌స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

తలమడుగు: మండలంలోని కుచూలాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఖోఖో పోటీలో అండర్ 14 బాలికల ఖోఖో పోటీలో ప్రతిభ కనబర్చి జోనల్ ఖోఖో పోటీలకు 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో వెంకటరావు తెలిపారు. విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డి, ఏజీఎస్ కన్వీనర్ కాంతారావు, కళ్యాణ్ లక్ష్మి రాజేశ్వర్, మాజీ సర్పంచ్ దేవరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలిసి శాలువావాతో సత్కరించారు. అలాగే పట్టణంలో నెలకొన్న సమస్యలతో పాటు మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కౌన్సిల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు బండారి సతీష్, కలాల్ శ్రీనివాస్, ఆవుల వెంకన్న ఉన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించాలి

తాంసి: ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి వంగా మహేందర్ రెడ్డిని గెలిపించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్ కోరారు. శనివారం భీంపూర్ మండలంలో వివిధ పాఠశాలలో ఓటర్ నమోదు ప్రారంభించి, ఓటర్ నమోదు పత్రాలు అందజేశారు. అర్హత కలిగిన ప్రతిఒకరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంపల ప్రభాకర్, ఉష్కం తిరుపతి, సురేశ్, ఉపాధ్యాయులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాతృ సంస్థతో సంబంధం లేదు

ఎదులాపురం: టీయూసీఐఎఫ్‌లో చేరిన సంస్థతో ఐఎఫ్‌టీయూ మాతృ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట నారాయణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ విధానాలను విభేదిస్తూ ఒక విభాగం సమాఖ్య నుంచి బయటికి వెళ్లి ఐఎఫ్‌టీయూ పేరుతో మరో సంస్థను ఏర్పాటు చేసి కొనసాగించారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల టీయూసీఐ అనే సంస్థలో విలీనం అవుతున్నట్లు ప్రకటన జారీ చేశారన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, గంగమ్మ, శ్యామ్, సునీత, లక్ష్మి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో వర్షం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని హీరాపూర్, ఈశ్వర్‌నగర్, అంజీ, వడగామ్, డొంగర్‌గామ్, హర్కపూర్ గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. అకాల వర్షం కురవడంతో చేతికి వచ్చిన సోయా, మొక్కజొన్న పంటలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా కాత, పూత దశలో ఉన్న పత్తి పంటకు కురిసిన వర్షం ప్రాణం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రంథాలయం చైర్మన్‌ను కలిసిన నాయకులు

బోథ్: ఇటీవల కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్తు మల్లేష్‌ను హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బత్తుల రమేశ్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. బోథ్ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంలో సత్తు మల్లేష్ కీలకపాత్ర పోషించారని కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

నేడు విగ్రహావిష్కరణ



పనులు చేయిస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ గ్రామంలో ఆదివారం కుమురం భీం విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్లు ఆదివాసీ నాయకులు తెలిపారు. శనివారం విగ్రహావిష్కరణ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ గోడం నగేశ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఐటీడీఏ అధికారులు హాజరుకానున్నట్లు గ్రామపటేల్ తొడసం ఇస్రు పేర్కొన్నారు.

గుడుంబా విక్రయదారుడి రిమాండ్

ఇచ్చోడ: మండలంలోని ఇచ్చోడ గ్రామానికి చెందిన జాదవ్ భీం లాల్ అనే గుడుంబా విక్రయదారుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గుడుంబా అమ్ముతూ పలుమార్లు పట్టుబడగా సదరు వ్యక్తిని ఇచ్చోడ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందన్నారు. లక్ష రూపాయల జరిమానా విధించామన్నారు. జరిమానాను సకాలంలో చెల్లించకపోవడంతో అదుపులోకి తీసుకొని ఏడాది పాటు రిమాండ్‌పై ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా జైలుకు తరలించినట్లుగా ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని నిషాన్‌ఘాట్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో దాడి చేసి ఆరుగురు వ్యక్తులు పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 3,130 నగదు, మూడు సెల్ ఫోన్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణం చిల్కూరి లక్ష్మినగర్‌లోని హిందీ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బద్కమహోళలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు పాఠశాలకు రెగ్యులర్‌గా వచ్చేలా చూడాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్

మార్కెట్‌యార్డు ఏర్పాటుకు కృషి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

నార్నూర్: గాదిగూడ, నార్నూర్ మండలాలను కలిపి మండల కేంద్రంలో మార్కెట్‌యార్డు ఏర్పాటుకు కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉప మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్, సహకార సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వ గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం సోయా పంటను రూ. 4892 ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టిడితే సహించేది లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే హమాలీ డబ్బులు తీసుకోవాలని, త్వరలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేసేలా అధికారులకు లేఖ రాస్తానని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్, మాజీ ఎంపీపీ కనక మోతుబాయి, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, తొడసం నాగోరావు, షేక్ దాదే అలీ, దుర్గే కాంతారావు, రాథోడ్ సికేందర్, జాదవ్ రెడ్డి నాయక్, జ్ఞానోబా పుస్కర్, చంద్రశేఖర్ జాదవ్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కోట్నాక్ జంగు సేవలు చిరస్మరణీయం

నార్నూర్ మండలంలోని గుంజాల గ్రామానికి చెందిన గోండి లిపి పండితుడు కోట్నాక్ జంగు గత నెలలో మృతి చెందడంతో శనివారం కుటుంబసభ్యులను ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంగు సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

ఇచ్చోడ: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని సేఫ్టీ మోటార్ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ యూసుఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నిర్మల్ బస్టాండ్ వద్ద రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సు ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేరుస్తుందన్నారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేయవద్దన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించడంతో ప్రమాదాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్, ప్రయాణికులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం చేయవచ్చని ఆర్టీసీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ రాజన్న అన్నారు. శనివారం నేరడిగొండ మండలం వాంకిడి గ్రామంలో ప్రయాణికుల అవగాహన కల్పించారు. ప్రయాణికులు రోడ్డు భద్రత పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే సమయంలో సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ప్రయాణికులు ఫోన్‌లో గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఎక్కాల్సిన బస్సు ఎప్పుడొస్తుందో తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అందకూర్ శంకర్, గ్రామస్తులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడ: మాట్లాడుతున్న యూసుఫ్

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: కుమురం భీం ఆశయసాధనకు కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం తాటిగూడ గ్రామంలో కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆదివాసీ హక్కుల కోసం జల్‌జంగల్ జమీన్ నినాదంతో పోరాటం చేశారని గుర్తు చేశారు. భీం స్ఫూర్తితో అనేక ఉద్యమాల్లో పాల్గొని నేడు ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానని అన్నారు. నేటి యువత మహనీయుడి బాటలో నడుస్తూ ఆయన కలలు కన్నా సమాజ స్థాపన కోసం ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం వేణునగర్ కాలనీలో కుమురం భీం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కుమురం భీం మనుమడు సోనేరావు, జిల్లా సార్మేడీ మెస్రం దుర్గు, మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, మర్సుకోల తిరుపతి, పుష్పరాణి, తదితరులు పాల్గొన్నారు.



భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

గంగపుత్రుల అభివృద్ధికి పెద్దపీట

మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం రాయితీతో చేప పిల్లలను అందజేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని గోపయ్య చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు.

కుమురం భీంకు ఘన నివాళి

నేరడిగొండ: కుమురం వంశస్తుల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో కుమురం భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి భీం విగ్రహానికి నివాళులర్పించారు. భీం వంశస్తులు కుమురం కేశవ్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. జల్ జంగల్ జామిన్ నినాదంతో ఉద్యమం చేయడం జరిగిందని, ఆదివాసీల మనుగడ కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాయి సెంటర్ సర్మేడి ఆత్రం గంగారాం, ఉప సర్మేడి (నాయకపోడ్ మండల అధ్యక్షుడు) పెరుమాండ్ల గంగాధర్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు తొడసం శంకర్, మండల అధ్యక్షుడు జుగ్నాక్ సాంబన్న, గ్రామ పటేళ్లు, దేవరీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆశయ సాధన కోసం కృషి చేయాలి

భీం ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. కుమురం భీం 84వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ర్యాలీ పాల్గొన్నారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో అడవి బిడ్డల హక్కులకోసం పోరాడిన భీం భీం పోరాట పటిమ ఎన్నటికీ మరువలేనిదన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు, రాజశేఖర్ రెడ్డి, తోడసం శంకర్, బద్దం పోతారెడ్డి, కపిల్ దేవ్, గుట్ట శంకర్, మురళీ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కుమురం వంశస్తులు

'కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు'

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. శనివారం మండలంలోని ఖండాల, అంకాపూర్ గ్రామాల్లో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రైతులను, ఆదివాసీలను మోసం చేస్తూ ప్రజా సంక్షేమ పథకాలను కాలరాస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో జాప్యం చేయడమే కాకుండా సంపూర్ణ రుణమాఫీ చేయకుండా రైతులను తీవ్ర ఇక్కట్లు గురి చేస్తుందన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండ్రత్ రమేశ్, నాయకులు మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, జగదీష్, పరమేశ్వర్, రమణ, గంగయ్య, జంగు బాపు, సిడాం లక్ష్మణ్, వసంత్, దేవిదాస్, మాధవరావు, సతీష్, రవి, భీంరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోగు రామన్న